క్లుప్తంగా

గ్రామాల్లోనే ఆధార్ సేవలు

కొలిమిగుండ్ల: ప్రజలు వ్యయప్రయాసలు పడకుండా ప్రభుత్వం గ్రామాల్లోనే ఆధార్ సేవలు అందిస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సుబ్బరాజు సూచించారు. బెలుం గ్రామ సచివాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న మొబైల్ ఆధార్ క్యాంప్‌ను గురువారం ఎంపీడీఓ తనిఖీ చేశారు. ప్రత్యేక క్యాంప్‌లో భాగంగా 170 మంది ఆధార్ సేవలు పొందారని ఆయన తెలిపారు. అంతకు ముందుగా సచివాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది హాజరుతో పాటు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ తాహీర్ హుశేన్, పంచాయితీ కార్యదర్శి పర్వేజ్ పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుపై దృష్టి సారించండి

బేతంచెర్ల: రైతులు పండ్లతోటల సాగుపై దృష్టి సారించాలని ఎంపీడీఓ వెంగన్న సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాయలంలో ఏపీఓ శేషన్న ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్స్, ఉపాధి సిబ్బందితో పండ్లతోటల సాగుపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ఈఏడాది 400 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా రైతుల వివరాలు సేకరించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మామిడి, చీని, నిమ్మ, జామ, థైవాన్ జామ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, నేరేడు, ఆపిల్ రేగు, డ్రాగన్ ఫ్రూట్, గులాబీ, మల్లె, మునగ సాగు చేపట్టవచ్చని, రైతులను చైతన్యపరచాలని సూచించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



తారకరామనగర్‌లోని దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఖాజాహుస్సేన్

డోన్ టౌన్: శీతలపానియాలు, నిత్యావసర సరుకులు ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ రేట్లకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తూనికలు కొలతల శాఖ అధికారి ఖాజాహుస్సేన్ వ్యాపారస్తులను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని తారకరామనగర్‌లోని ఓ దుకాణంలో తనిఖీ చేశారు. శీతలపానీయాలు అధిక ధరలకు విక్రయిస్తుండటంతో కేసు నమోదు చేసి రూ.5వేల జరిమానా విధించి బాటిళ్లను సీజ్ చేశారు. ప్యాపిలి పట్టణంలోనూ నాలుగు దుకాణాలు తనిఖీ చేసి రు.16వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

నేడు లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణ మహోత్సవం

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో వెలసిన శ్రీకంబగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ 13వ వార్షికోత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. స్వామివారి ఉపవాసకులు రామ్మోహనస్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. శుక్రవారం యాగశాల ప్రవేశం, సంకల్పం, నిత్య హోమం, నిత్య పర్ణాహుతి, 108 కళాభిషేకం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఉసేన్‌స్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు



ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరులో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతోపాటు కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూలదట్టీలు, జెండాలతో ఊరేగింపు నిర్వహించి ఉసేన్‌స్వామికి ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

డోన్ టౌన్ : సైబర్ నేరాలు, ఆన్‌లైన ఋణ యాప్‌ల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని న్యాయవాదులు గోపాల్‌రెడ్డి, ఆంజనయ్యగౌడ్ తెలిపారు స్థానిక ఫోటాన్ ఇనిస్టిట్యూట్‌లో గురువారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన కలిగివున్నప్పుడు సమాజంలో సమన్యాయం పొందడంతో పాటు హక్కులు కాపాడుకోవచ్చునని వారు తెలియజేశారు. అనంతరం ఫోటాన్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకుడు సాయినాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్ పథకం కింద నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆరవ తరగతిలో ప్రవేశానికి 117 దరఖాస్తులు

కొలిమిగుండ్ల: 2023-24 విద్యా సంవత్సరంలో మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతిలో ప్రవేశం కోసం 117 దరఖాస్తులు వచ్చాయని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చంద్రసేనారెడ్డి తెలిపారు. గురువారంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల గడువు ముగిసిందన్నారు. జూన్ 11న పాఠశాలలో ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు.





ప్యాపిలి మండలం ఊటకొండ - గోపాల్ నగరం రోడ్డు పరిస్థితి



గతంలో డోన్-రాయలచెరువు రోడ్డు పరిస్థితి



ప్రస్తుతం కళకళలాడుతున్న డోన్-రాయలచెరువు రోడ్డు

రహదారులకు మహర్దశ!

డోన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏళ్లతరబడి కనీసం మరమ్మతులకు నోచుకోని రహదారులకు మహర్దశ పట్టింది. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరువతో డోన్ నియోజకర్గంలోని పట్టణ, గ్రామీణ రహదారులు తలతల మెరుస్తున్నాయి. ప్యాపిలి మండలం ఊటకొండ మధ్య 1 కిమీ రోడ్డును రూ.1.50 కోట్లతో నిర్మించారు. నాడు ఎంతో అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు ప్రస్తుతం కళకళలాడుతుంది. ఈ నెల 27న మంత్రి బుగ్గన ఈ రహదారిని ప్రారంభించి పాదయాత్ర చేస్తారని పంచాయితీ రాజ్ శాఖా ఏఈ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. డోన్ నుంచి అనంతపురం జిల్లా రాయలచెరువు వరకు 36 కిమీ పొడవు రహదారిని రూ. 46 కోట్ల వ్యయంతో నిర్మించారు. దీంతో సుమారు నియోజక వర్గంలోని 16 గ్రామాలకు రహదారి సౌకర్యం సులువైంది. డోన్ -కన్నపకుంట - కమలాపురం వరకు 8 కిమీ వరకు, చిన్న మల్కాపురం నుంచి పెద్ద మల్కాపురం, ఓబులాపురం ఎన్‌హెచ్ 44 రహదారి నుంచి రేకుల కుంట వరకు, ఎన్‌హెచ్ 44 నుంచి దేవర బండ - మిద్దెపల్లె - ఎద్దుపెంట, ఎద్దుపెంట క్రాస్ - తాడూరు -ఎస్ గుండాల, డోన్ -వెంకటాపురం- గుమ్మకొండ, ఎన్‌హెచ్ 44 నుంచి జగదుర్తి, ఎన్‌హెచ్ 44 నుంచి తాటిమాను కొత్తూరు, డోన్ నుంచి వెంకటాపురం, డోన్ నుంచి మల్లెంపల్లె, ప్యాపిలి మండలం వెంగళాంపల్లె నుంచి ఈదుల దేవర పల్లె, ఎన్ రాచర్ల నుంచి కంబగిరి స్వామి దేవస్థానం వరకు కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు నిర్మించడంతో కళకళలాడుతున్నాయి. రహదారి సమస్యలు తీరడంతో నియోజకవర్గ ప్రజలు మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రేవనూరు ఎస్‌ఐగా కల్పన



కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు పోలీస్‌స్టేషన్‌లో సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా కల్పన గురువారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ మద్దికెర మండలానికి బదిలీ అయ్యారు. నంద్యాల జిల్లా దిశ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న కల్పనను ఇక్కడికి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఏఎస్‌ఐలు, సిబ్బంది కొత్త ఎస్‌ఐకి స్వాగతం పలికారు.

అవుకు ఎస్‌ఐగా నాగేంద్ర కుమార్



అవుకు: అవుకు పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా నాగేంద్ర కుమార్ గురువారం భాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ జగదీశ్వర్ రెడ్డి వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో గూడురు ఎస్‌ఐ నాగేంద్ర కుమార్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకారం అందజేయాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించమని, చర్యలు తప్పవని హెచ్చరించారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శేషయ్య

డోన్ టౌన్: ట్రాఫిక్ నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలని, పోలీసుల నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ పెనుగొండ శేషయ్య సూచించారు. ప్రత్యేకించి ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ప్రజలకు ఏలాంటి ఆటంకం కలుగకుండా వ్యాపారస్తులు లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేసుకోవాలన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం రాత్రి పట్టణానికి చెందిన కిరాణం, సిమెంట్, ఐరన్, ఎరువుల దుకాణాల నిర్వాహకులతో సీఐ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోడింగ్, అన్‌లోడింగ్ కోసం భారీ వాహనాలు రద్దీ సమయంలో పట్టణంలోకి ప్రవేశిస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వ్యాపారస్తులు సహకరించి ఉదయం 7గంటలలోపు, రాత్రి 9గంటల తరువాత లోడింగ్, అన్ లోడింగ్ పనులు చేసుకోవాలని ఆదేశించారు. ఇందుకు విరుద్ధంగా ఎవ్వరైనా వ్యవహరిస్తే జరిమానా విధించడంతపాటు వ్యాపారస్తులపై న్యూసెన్స్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్‌ఐలు శరత్‌కుమార్‌రెడ్డి, నగేష్, ఎఎస్‌ఐలు గోపాల్, భాస్కర్, రామసుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు పత్రాలతో యాజమానికి ఇబ్బంది ఉండదు



మాట్లాడుతున్న అశోక్‌వర్ధన్‌రెడ్డి

డోన్ టౌన్: కౌలు రైతులకు జారీ చేసే కౌలు పత్రాలతో భూ యజమానులకు ఏలాంటి ఇబ్బంది ఉండదని డోన్ డివిజన్ వ్యవసాయ ఉప సంచాలకులు అశోక్‌వర్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ధర్మారం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే కౌలు పత్రాల ద్వారా పంటల నమోదు, పంటల బీమా సౌకర్యం పొందువచ్చన్నారు. కౌలు పత్రాలు పొందితే ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు పంట నష్ట పరిహారం పొందడానికి వీలవుతుందన్నారు. కౌలు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవానలి సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ షఫీ, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌలుకార్డులకు దరఖాస్తు చేసుకోండి

బేతంచెర్ల: మండలంలోని ఆయా గ్రామాల్లో అర్హులైన కౌలు రైతులు లు కౌలు కార్డుల కోసం రైతు భరోసా కేంద్రంలోని అగ్రి కల్చర్ అసిస్టెంట్స్, వీఆర్వోను సంప్రదించాలని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని ఎం.పేండేకల్లు గ్రామంలోని రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 31లోపు కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ జీసాన్, ఏఈఓలు మధు, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన సదస్సు

సంజామల: మండలంలోని ఆకుమల్ల రైతు భరోసా కేంద్రంలో గురువారం ఏఓ సుధాకర్ రెడ్డి కౌలు కార్డులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ భూ యజమాని, సాగుదారుడి మధ్య ఒప్పంద పత్రం మాత్రమే కౌలు కార్డు అని, కాల పరిమితి 11 నెలలు మాత్రమే ఉంటుందన్నారు. కౌలుకార్డు జారీ మూలంగా యజమాని హక్కులకు ఏ మాత్రం ఇబ్బంది ఉండదన్నారు. కార్డు పొందిన కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, పంటల బీమా, పంట నష్టపరిహారం తదితర వ్యవసాయానికి సబంధించిన సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు సాయి మానస, ఎంపీఈఓ స్రవంతి పాల్గొన్నారు.

రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం వర్తింపజేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అల్వకొండ మద్దిలేటి

కోవెలకుంట్ల: రజకవృత్తిని నమ్ముకుని తరతరాలుగా జీవనం సాగిస్తున్న రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం వర్తింపజేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అల్వకొండ మద్దిలేటి కోరారు. గురువారం మండలంలోని కంపమల్లలో రజకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకులు నేటికీ ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో వెనుబడి ఉన్నారన్నారు. శ్రమకు తగ్గ ప్రతిఫలం అందకపోగా కుల వివక్షతకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రజకులపై దాడులు, దౌర్జన్యాలు జరుగుతున్నాయన్నారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి రక్షణకు ప్రత్యేక చట్టం రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నరసింహులు, రాముడు, చిన్న నారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

మూడు బర్రెలు మృతి



మృతి చెందిన బర్రెలు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న చెరువుపల్లె గ్రామానికి చెందిన ఆవుల షేక్షావలికి చెందిన మూడు బర్రెలు శనగ గుళికలు వేసిన పొలంలోని పశుగ్రాసం తిని అక్కడిక్కడే మృతి చెందినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి గురువారం తెలిపారు.బాధిత రైతు,ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు ఆవుల షేక్షావలి తన పొలంలో బర్రెలను మేపేందుకు పొలంలో వదలి ఇంటికి వచ్చాడు. అయితే తన పొలం పక్కనే ఇదే గ్రామానికి చెందిన రాజమ్మగారి చిన్నబాషా తన పొలంలో సాగు చేసిన టమాటా, బీరకాయల పైరుకు శనగ గుళికలను పిచికారీ చేశాడు. ఆ పొలంలో బర్రెలు మేయడంతోనే మృతి చెందాయని, వాటి విలువ సుమారు రూ.1.30లక్షల ఉంటుందని బాధితుడు షేక్షావలి ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు రాజమ్మగారి చిన్న బాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. కాగ మృతి చెందిన బర్రెలకు నందవరం పశువైద్యులు డాక్టర్ రాఘవేంద్రారెడ్డి తన సిబ్బందితో కలిసి శవపరీక్ష నిర్వహించారు.

టీ.ఎంసెట్ ఫలితాల్లో శ్రీసుధ విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీసుధ జూనియర్ కళాశాల విద్యార్థులు తెలంగాణ రాష్ట్రం నిర్వహించిన ఎంసెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనభరిచారు. గురువారం వెలువడిన ఫలితాల్లో కళాశాలకు చెందిన కావ్యాంజలి 1510వర్యాంకు, శ్రీజ - 2547, రజిత్- 5222, వెంకటసుధీర్-7235, హిమజ-7969, సుదర్శన్ - 8833, వినోద్ - 10452, మేఘన - 11365, తేజస్వని -11872వ ర్యాంకు సాధించినట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ యోగానందరెడ్డి తెలిపారు. పట్టణంలోని అన్ని కళాశాలల కంటే శ్రీసుధ కళాశాల విద్యార్థులు అత్యధికంగా ప్రవేశ పరీక్షలో అర్హత సాధించినందుకు విద్యా సంస్థ డైరెక్టర్లు విద్యార్థులను అభినందించారు.

మంచినీటి సమస్యకు పరిష్కారం



నీరు వదులుతున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెద్దవెంతుర్లలో వేసవిని దృష్టిలో ఉంచుకొని మంచి నీటి సమస్యకు పరిష్కారం చూపారు. గ్రామంలో ఇటీవల తాగు నీటి పథకానికి చెందిన బోరులో నీరు తగ్గిపోయి కొన్ని వీధులకు నీటి సరఫరా సరిగా అందడం లేదు. సమస్యను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే స్పందించిన ఆయన రైతు భరోసా కేంద్రం సమీపంలో కొత్తగా బోరు వేయించారు. గురువారం గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో బోరుకు మోటార్ అమర్చారు. పైపులైన్‌కు అనుసంధానం చేసి ప్రజలు తాగునీటికి ఇబ్బంది లేకుండా చేస్తామని సర్పంచ్ పద్మాంజలిదేవి పేర్కొన్నారు. గ్రామానికి అడిగిన వెంటనే బోరు ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే కాటసానికి సర్పంచ్‌తో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కనుల పండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



భూదేవి, శ్రీదేవి, సమేత వేంకటేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల : పట్టణంలోని దుర్గాపేటలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామికి కల్యాణం గురువారం భక్త జన సందోహం మధ్య కనుల పండువగా నిర్వహించారు. రిటైర్డు ఎస్‌ఐ మద్దయ్య దంపతుల, కాలనీ వాసుల ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మావార్లకు అభిషేకము, కుంకుమార్చన, మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవమూర్తులైన స్వామి అమ్మవార్లను కాలనీ పురవీధుల గుండా మేలతాళాలల మధ్య ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ నంద్యాల డివిజన్ కన్వీనర్ నాగమోహన్‌రెడ్డి, సభ్యులు రమణ, పట్టణ వాసులు గుండాగోపాలు, హుసేన్‌రెడ్డి, భజన కృష్ణయ్య, రమణ, లక్ష్మీనారాయణ, డాక్టర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీపీ భవన నిర్మాణానికి భూమిపూజ

డోన్ : డోన్ మండల ప్రజాపరిషత్ నూతన భవన నిర్మాణానికి శుక్రవారం మధ్యాహ్నం 12.15కు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి భూమి పూజ చేయనున్నారు. రూ.1.50కోట్లతో ఎంపీపీ కార్యాలయం ఆవరణంలో అత్యంత ఆధునిక వసతులతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. 24-11-1975న సమితి భవనాలు నిర్మించారు. ఈభవనంలోనే మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత మండల ప్రజాపరిషత్ భవనాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రభుత్వం నూతన భవన నిర్మాణానికి నిధులను మంజూరు చేసిందని ఎంపిపి రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనిజీర్ జిలానీ సమూన్, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఆర్‌డీఓ వెంకటరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్ కుమార్, మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీడీఓ శ్రీనివాసులు హాజరవుతారన్నారు.

పెనుగాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

కొలిమిగుండ్ల: మండలంలో గురువారం వాతావరణంలో ఒక్క సారిగా మార్పులు చోటు చేసుకోవడంతో గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. కల్వటాల, నందిపాడు,తిమ్మనాయినపేట గ్రామాల్లో గాలుల దాటికి పదికి పైగానే విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా సాయంత్రానికి ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయి. గాలులు వీస్తుండటంతో విద్యుత్ అధికారులు ముందస్తుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఉరుములు, మెరుపులు దాటికి ఇళ్లలో టీవీలు దెబ్బతిన్నాయి.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

కోవెలకుంట్ల: నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకంలో పక్కాగృహాలు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ పుష్పకుమారి సూచించారు. గురువారం పట్టణ శివారులోని జగనన్న కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను వారు పరిశీలించి మాట్లాడారు. పక్కాగృహానికి ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 1.80 లక్షలు చెల్లిస్తోందన్నారు. బిల్లుతోపాటు రాయితీపై కడ్డీలు, సిమెంట్, ఉచితంగా 20 టన్నుల ఇసుక, ఇంటినిర్మాణ సామగ్రి సరఫరా చేస్తోందన్నారు. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఈఓపీఆర్‌డీ రాధిక, హౌసింగ్ ఏఈ సుదర్శన్, ఆర్‌ఐ ఇమ్రాన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నివాళి

బేతంచెర్ల : స్థానిక లారీ మోటార్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపకుడు వెంకటయ్య 25వ వర్ధంతి ని గురువారం సీఐటీయూ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బలపాలపల్లె రహదారిలోని వెంకటయ్య సమాధిపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎల్లయ్య, బేతంచెర్ల లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వైబీ వెంకటేశ్వర్లు, నాయకులు మద్దిలేటిస్వామి, నాగేష్, కలాం, జలంధర్ పాల్గొన్నారు.

నగర పంచాయతీని ఆదర్శంగా దిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న చలం రెడ్డి

బేతంచెర్ల: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రత్యేక చొరవతో నగర పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్మన్ చలం రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా కాలనీల్లో చేపట్టే పనులు, చేసిన అభివృద్ధిని కమిషనర్ రమేష్ బాబు వివరించారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో ఎన్నో సంవత్సరాలుగా నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. మీ వార్డుల పరిధిలోని జగనన్న లేఔట్ కాలనీల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని వివరించి నిర్మాణాలు వేగవంతం చేసేలా ప్రోత్సాహించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్, కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, మధు,షేక్ ముబీనా, వెంగమ్మ, మహేశ్వరీ, నాగజ్యోతి, ఏఈ సురేష్ బాబు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేష్ నాయక్, జూనియర్ అసిస్టెంట్ మల్లికార్జున, మెప్మా కోర్డినేటర్ శ్రీదేవి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించండి



ఆటో డ్రైవర్ల కు సూచనలు ఇస్తున్న సీఐ

బేతంచెర్ల: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరించాలని, పోలీసుల సూచనలు పాటించాలని సీఐ ప్రియతం రెడ్డి సూచించారు. ప్రత్యేకించి ఆటో డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ నిలుపొద్దని, నిర్ణయించిన స్థలంలోనే ఉంచాలని చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ల్లో గురువారం మండలంలోని ఆటో డ్రైవర్లు, వాహనదారులతో సీఐ సమావేశమయ్యారు. ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించడమే కాకుండా కెపాసిటీకి మంచి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. అదేవిధంగా ప్రధాన రహదారి వెంట నిర్ణీత వేగం పాటించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సుతో పాటు ఆటోలకు బీమా సౌకర్యం ఉండాలన్నారు. బీమా లేకపోతే ప్రమాదాలు జరిగితే మీరే ఇబ్బంది పడతారన్నారు. వాహనచోదకులు బాధ్యతగా వాహనాలు నడిపి ప్రమాదాల నివారించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.

ఉద్యోగం పేరుతో యువకుడికి టోకరా

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామానికి చెందిన ఓ యువకుడికి కర్నూలుకు చెందిన వ్యక్తి అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి డబ్బు తీసుకుని మోసం చేయడంతో బాధితుడు పోలీసు స్టేషన్ ఆశ్రయించాడు. గురువారం ఎస్‌ఐ శివశంకర్ నాయక్ తెలిపిన వివరాలు.. అంబాపురం గ్రామానికి చెందిన గోరంట్ల గారి శివకృష్ణకు అగ్రికల్చర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని 2021లో కర్నూలు పట్టణానికి చెందిన సయ్యద్ సద్దామ్ హుస్సేన్ రూ.2 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం గురించి అడిగితే అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేశాడు. చివరకు ఉద్యోగం ఇప్పించకపోవడంతో మోసపోయానని తెలుసుకున్న బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంజామల: మండల పరిధిలోని ఆల్వకొండ గ్రామానికి చెందిన హాజీరత్(55) గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.హాజరత్ సాయంత్రం పొలం పని పూర్తి చేసుకుని ఇంటికి బైకుపై వస్తుండగా అదే రహదారిలో కాశీపురం నుండి రెడ్డిపల్లికి వెళ్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొంది. హాజరత్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ ప్రతాప్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతామని ఆయన తెలిపారు.

వృద్ధురాలికి గాయాలు

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటన ఖాదర్‌బీ అనే వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు నందివర్గం గ్రామానికి చెందిన వృద్ధురాలు ఖాదర్‌బీ రాత్రి భోజన అయిన తరువాత కుటుంబ సభ్యులతో కలిసి గోనవరం రోడ్డు వైపు వాకింగ్ వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తుండగా నందివర్గం నుంచి గోనవరం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి ఖాదర్‌బీని ఢీ కొట్టడడంతో వాహనం కాళ్లపై వెళ్లింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నంద్యాల శాంతిరామ్ వైద్యశాలకు తరలించా రు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాల్సి ఉంది.

బ్రిడ్జిపై నుంచి బోల్తా పడిన ట్రాక్టర్



కొలిమిగుండ్ల: ఇటిక్యాల సమీపంలోని బ్రిడ్జిపై నుంచి గురువారం ట్రాక్టర్ బోల్తా పడింది. ఈప్రమాదంలో ఇద్దరు సురక్షితంగా బయట పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా యాడికి మండలం నగరూరు నుంచి కొలిమిగుండ్ల మండలంలోని ఇటిక్యాల సమీపంలోని కొండలో చెట్ల మొద్దులు తీసుకునేందుకు ట్రాక్టర్‌లో వచ్చారు. అడ్రస్ సరిగా తెలియక పోవడంతో ట్రాక్టర్ బ్రిడ్జి ముందుకు దాటి పోవడంతో తిరిగి వెనక్కి వస్తున్న తరుణంలో కిందకు పడిపోయింది. ట్రాక్టర్‌లో ఉన్న సాయికిరణ్‌తో మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. అయితే ట్రాక్టర్ వెళ్తున్న సమయంలో వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఈప్రమాదం జరిగిందని క్షతగాత్రులు పోలీసులకు చెప్పడంతో ఆరా తీస్తున్నారు.